క్లుప్తంగా

క్రీడాదుస్తుల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు పీఎంసీ చైర్మన్ రమణారెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కృష్ణమోహన్, పీఈటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీమా పరిహారం మంజూరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం టౌన్‌షిప్ భారతీయ స్టేట్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా చేసి మృతి చెందిన కుటుంబాలకు మంగళవారం రు.2లక్షల చొప్పున బ్రాంచి మేనేజర్ రాజశేఖర్ మంజూరు పత్రాలను అందజేశారు. సున్నిపెంట వాసులైన గోగుల శ్రీనివాసులు కుమారుడు ఆంజనేయులు, తాటికొండ మౌలాలి భార్య చంద్రకళకు ఒకొక్కరికి రు.2లక్షల మంజూరు పత్రాలను అందజేయడంతో పాటు వారి అకౌంట్‌లో నగదును జమ చేశారు.

తర్తూరుకు పదినిమిషాలకో బస్సు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరకు ప్రతి పదినిమిషాలకో బస్సును తిప్పుతున్నట్లు నందికొట్కూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన తర్తూరు జాతరలో ఏర్పాటు చేసిన బస్టాండును పరిశీలించారు. నందికొట్కూరు డిపో నుంచి ప్రస్తుతం 20 బస్సులను జాతరకు తిప్పుతున్నట్లు తెలిపారు.

తర్తూరు జాతరలో అపశృతి

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో రథోత్సవం అనంతరం విద్యుదాఘాతంతో చెరుకు రసం బండి పెట్టుకొన్న ఎస్.ఎల్లయ్య(32) అనే వ్యక్తి మృతిచెందాడు. నందికొట్కూరు పట్టణంలోని భైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌కు చెందిన ఎస్.ఎల్లయ్య అనే వ్యక్తి తర్తూరు జాతరలో చెరుకురసం బండిని ఏర్పాటు చేసుకున్నాడు. అతనికి అధికారులు సకాలంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలకు నేరుగా కొక్కేలు తగిలించుకునేందుకు యత్నించాడు. విద్యుత్ షాక్ తగలడంతో స్పృహతప్పిపోయాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విద్యుత్ అధికారులు సకాలంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవటం వల్లే ఘటన చోటుచేసుకుందని మృతు ని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రామాచారిని వివరణ కోరగా తమ సిబ్బంది ఎల్లయ్యకు విద్యుత్‌కనెక్షన్ ఇచ్చే లోగా నేరుగా 11కేవీ విద్యుత్ తీగలకు కొక్కేలు తగిలించుకోవటం వల్లే ప్రమాదం జరిగిందన్నారు.

‘పది’ టాపర్లకు ప్రశంసలు

పగిడ్యాల: పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్లుగా నిలిచన గుంపుల యశ్వంత్, సి. శోభారాణి, షేక్ సమ్రీన్‌లను మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అభినందించారు. ప్రిన్సిపాల్ సుజన ఆధ్వర్యంలో పాఠశాలలో అభినందక సభ నిర్వహించారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరు మండలంలో ఎన్నికల ప్రచారం
- చెంచు గిరిజన గూడేల్లో విశేష స్పందన



బైర్లూటీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: గిరిజనుల సంక్షేమానికి తాను ఎంతగానో కృషి చేశానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మండలంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆత్మకూరు, నాగలూటి, బైర్లూటి తదితర గిరిజనగూడేల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెంచు గిరిజనగూడేల్లో ఎన్నికల ప్రచారానికి గిరిజనులు పోటెత్తారు. బైరూటి, నాగలూటి చెంచుగూడేలు, ఎస్.ఎన్.తండాలో గిరిజనులు తండోపతండాలుగా ఎమ్మెల్యే నడుస్తూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. తాము సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధి పొందామని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి ఓట్లు వేసి గెలిపిస్తామని ముక్తకంఠంతో తెలిపారు. అలాగే మండలంలోని బైర్లూటి, నాగలూటి, ఎస్.ఎన్.తండా, సిద్ధాపురం, వెంకటాపురం, క్రిష్టాపురం, అమలాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషిరెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఎమ్మెల్యే శిల్పాకు పుష్పగుచ్ఛాలు, గజమాలలతో స్వాగతం పలికారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశా

చెంచుగూడెంలు అన్యాక్రాంతం కావడంతో తాము అసెంబ్లీలో చర్చించి భూపట్టాలు ఇప్పించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పంట నష్టపరిహారం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, రైతుభరోసా తదితర పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామన్నారు. గిరిజనులకు అన్యాక్రాంతమైన భూములను ఆర్వోఎఫ్ఆర్ ల్యాండ్ ద్వారా పట్టాలు ఇప్పించామన్నారు. ఇందులో భాగంగా చెంచు గిరిజనులకు బైర్లూటిలో 110 పక్కా గృహాలు, నాగలూటిలో 100 గృహాలు కట్టించి చెంచుల జీవన విధానం అభివృద్ధి చెందేలా చేశామని చెప్పారు. ఫల సేకరణలో అడ్డంకిగా ఉన్న ఫారెస్ట్ అధికారులను అసెంబ్లీలో ప్రస్తావించి, అటవీశాఖ మంత్రితో మాట్లాడి అడ్డంకులు తొలగించామని గుర్తు చేశారు. శ్రీశైలం ఉత్సవ పర్వదినాల్లో కాలినకడన వెళ్లే భక్తుల నుంచి ఫారెస్ట్ అధికారులు రూ.10 వసూలు చేసే అటవీ చార్జీలను తొలగించామన్నారు. భక్తులు స్వేచ్ఛగా వెళ్లేలా వీలు కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీకి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, పువ్వాడ భాస్కర్, జెడ్ శ్రీనివాసరెడ్డి, సత్తూరు ప్రతాపరెడ్డి, సర్పంచ్‌లు గురువమ్మ, శివశంకర్‌నాయక్, కుందూరు శివారెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, రవినాయక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మోసగాళ్ల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

- శాప్ రాష్ట్ర చైర్మన్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి



జగన్ రఫితో పాటు కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: మోసగాళ్ల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 5వ వార్డులో జగన్ రఫితో పాటు కుటుంబ సభ్యులు పెద్ద ముర్తుజావలి, చిన్న ముర్తుజావలి, అన్వర్‌బాషా, పెద్ద అమీద్, వలిబాషా, చిన్న అమీద్, మన్సూర్, సుభాన్, జహీర్, సిరాజ్, చాంద్, మౌలాలి, సిద్ధయ్య, నడిపి ముర్తుజావలి, శివ, మురళి, వెంకటేష్, ముత్తులను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ 600 హామీలు ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందామన్నారు. ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చాంద్ బాషా, కృష్ణ, అశోక్, చిన్నరాజు, పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు అబుబక్కర్, ఉపేంద్రారెడ్డి, అబ్దుల్లా, భాస్కర్‌రెడ్డి, శేఖర్, రమణారెడ్డి, బ్రహ్మగౌడ్ల బాబు, గుర్రం భాస్కరరెడ్డి, రాజు పాల్గొన్నారు.

దారా సుధీర్ నామినేషన్‌కు తరలిరావాలి

వైఎస్సార్‌సీపీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నామినేషన్‌కు భారీ సంఖ్యలో తరలి రావాలని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 9 గంటలకు పగిడ్యాల రోడ్డు బ్రహ్మంగారి మఠం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాములపాడు: ధైర్యంగా ఉండండి అన్ని విధాల అండగా ఉంటామని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సద్దల మహేష్ కుటుంబాన్ని పరామర్శించారు.

వలంటీర్ల రాజీనామా

నందికొట్కూరు రూరల్/ పాములపాడు/ కొత్తపల్లి/ జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండల పరిధిలోని కోళ్లబావాపురం, కొణిదేల, వడ్డెమాను, పాములపాడు మండలంలోని బానకచెర్ల, పగిడ్యాల మండలంలోని పగిడ్యాల, కొత్త ముచ్చుమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాలకు చెందిన 31 మంది వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. అలాగే కొత్తపల్లి మండలంలో 15 మంది, జూపాడుబంగ్లా మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన 19మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓలు జవహర్ బాబు నూర్జహాన్ తెలిపారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



పూజలు నిర్వహిస్తున్న దారా సుధీర్, ఎంపీ పోచా, బైరెడ్డి మల్లికార్జునరెడ్డి

జూపాడుబంగ్లా: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామిని కోరుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మనందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం రథోత్సవాన్ని పురస్కరించుకొని వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మద్దిలేటిరెడ్డి, తరుణ్‌కుమార్ రెడ్డి, తువ్వామల్లారెడ్డి, తిమ్మాపురం సర్పంచ్ నాగస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి గుణపాఠం చెప్పాలి



వెలుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వెలుగోడు: రానున్న ఎన్నికల్లో ఓటుతో టీడీపీకి గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గుండ్రెడ్డి రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 98, 101, 106, 111, 112, 119, 120వ బూత్‌ల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మనందరెడ్డిల ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, గోవిందు పాల్గొన్నారు.



శ్రీశైలంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఏ రజాక్

జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో ఆనందాలు

శ్రీశైలంటెంపుల్: జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలతో ప్రతి ఇంట్లో ఆనందాలు వెల్లివిరిసాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ అన్నారు. శ్రీశైలంలోని 10వ బూత్ పరిధిలోని కాలనీలలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి, విష్ణు, షేక్షావలి, అమీర్, సర్దార్, శరత్, ప్రభావతి, జిల్లెల లక్ష్మీదేవి, సవమ్మ, కొటమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

ఫ్యానుకు ఓటేయడమే జగనన్నకు పెద్ద కానుక



ప్రచారం చేస్తున్న ఎల్లాలు బాబు

మహానంది: పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి మళ్లీ సీఎంగా గెలిపించుకోవడమే మన ఆయనకిచ్చే పెద్ద కానుకని ఆంధ్రప్రదేశ్ మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి ఎల్లాల బాబు అన్నారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని మేదర కాలనీలో మంగళవారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు ఎస్సీ కాలనీ, కొత్తకొట్టాలలో, సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, సర్పంచ్ గడ్డం చంటి గాజులపల్లెలోని పలు కాలనీల్లో ప్రచారం చేపట్టారు.



ప్రచారం నిర్వహిస్తున్న కొండా మధుసూదన్‌రెడ్డి

ఆరో రోజు నాలుగు నామినేషన్లు

నందికొట్కూరు: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆరోవ రోజు నలుగురు నామినేషన్లు వేశారని ఆర్వో దాసు తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తరుపున కాటం వెంకటరమణ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోవ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున కాటం వెంకటరమణ, జై భారత్ నేషనల్ పార్టీ తరుపున బొర్రెల్లి వెంకటరమణ, భారత చైతన్య యువజన పార్టీ తరుపున చిమ్మె వెంకటరమణ, సోషల్ డెమోక్రసీ పార్టీ ఆఫ్ ఇండియా శాబోలు లింకన్ రాజు నామినేషన్ సమర్పించారన్నారు.

ఆరు నామినేషన్లు దాఖలు

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం శ్రీశైలం నియోజకవర్గానికి ఆరుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పెద్దిరెడ్డి గంగాధరరెడ్డి, నాగమల్లికార్జునరెడ్డి, ఇలియాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇస్మాయిల్, జైభారత్ నేషనల్ పార్టీ తరపున సయ్యద్‌సికిందర్ బాషా 2వ నామినేషన్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డి తరపున 3వ సెట్ నామినేషన్‌ను జయకృష్ణ దాఖలు చేశారన్నారు.

ఒక్కరూ హాజరు కాలేదు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు ఎవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.